www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 14 | మార్చి | 2026
పేజీలు : 8

## భద్రాద్రి జిల్లాలో రగులుతున్న పోడు వివాదం



**-ఫారెస్ట్ అధికారుల దాడిలో గిరిజనులకు గాయాలు**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని కృష్ణ సాగర్ బట్టుగూడెం గ్రామంలో పోడు భూముల వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. పోడు సాగు చేస్తున్న భూముల్లో ట్రెంచ్‌లు తవ్వేందుకు వచ్చిన ఫారెస్ట్ అధికారులతో మాట్లాడేందుకు మిగతా 2లో..

# గెలుపు మార్పుకు నాంధి పలకాలి




**- సమాజ వికాసం కోసం ప్రజాప్రతినిధులు పనిచేయాలి**
**- శిక్షణా తరగతుల్లో ప్రొ. కోదండరామ్**







**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజాస్వామిక పద్ధతుల్లో సాధించిన గెలుపు సమాజ మార్పుకు నాంధి పలకాలని ప్రొ.కోదండరామ్ అన్నారు. రాజ్యాంగానికి లోబడి జవాబుదారీ పాలనను అందిస్తూ ప్రజల హక్కులను రక్షించడంతో పాటు పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన గెలుపొందిన కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచుల రెండు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం పాల్వంచ సుగుణా గార్డెన్స్‌లో ప్రారంభమైంది. సిపిఐ భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ గణేష్ అధ్యక్షవర్గంగా వ్యవహరించిన శిక్షణా తరగతుల్లో కోదండ రామ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ముఖ్యంగా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు రాజకీయ దృక్పదంతో పాటు ప్రత్యేక లక్ష్యం ఉండాలని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పనితీరు ఉధ్యమాన్ని నిలబెట్టాలని సూచించారు. ఒకప్పుడు ప్రజాప్రభుత్వాలు ఉండేవి కావని, దేవుని అనుగ్రహం ఉన్నవారు మాత్రమే పాలకులు అవుతారని నమ్మేవారని, కానీ రానురానూ వచ్చిన మార్పుతో దేవునితో సంబంధం లేని మానవతా వాదంతో ఒక వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం మిగతా 2లో..

## దేశంపై యుద్ధ ప్రమాదం




**- పెరుగుతున్న ధరలు.. ఇబ్బందుల్లో ప్రజలు**
**- సిపిఐ ప్రతినిధులుగా త్యాగచరితను కొనసాగించండి**
**- సిపిఐ శిక్షణా తరగతుల్లో డాక్టర్ కె.నారాయణ**

**ప్రజాపక్షం/కొత్తగూడెం/పాల్వంచ :** భారత దేశంపై యుద్ధ ప్రమాదం పడిందని, గ్యాస్ సహా, నిత్యవసరాల ధరలు పెరిగిపోతున్నాయని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోతున్నాయని సిపిఐ జాతీయ క్రమ శిక్షణా సంఘం అధ్యక్షులు డా.కే నారాయణ తెలిపారు. సంపదపై కన్నేసి మోడి సాగిస్తున్న దాడులు సామాన్య ప్రజలకు ఇబ్బంది కరంగా మారాయని ఆయన తెలిపారు. సిపిఐ శిక్షణా తరగతుల్లో భాగంగా పాల్వంచలోని సుగుణ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న సిపిఐ ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయ సామాజిక పరిస్థితులు ప్రజా ప్రతినిధులు అనే అంశాన్ని ఆయన బోధించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల విధానంలో వచ్చిన మార్పులు వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుంటే ప్రజాప్రతినిధులుగా గెలుపొందడం గొప్ప విషయమని, సామాన్యున్ని సైతం గౌరవ ప్రజాప్రతినిధులుగా నిలిపిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులుగా ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు భాగాన నిలుస్తూ త్యాగల చరితను కొనసాగించాలని నారాయణ సూచించారు. ప్రజాప్రతినిధులకే అర్ధం మారిపోతున్న ఈ రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి సిపిఐ ప్రజాప్రతినిదులు సమస్యల పరిష్కారానికి ముందు వరుసలో నిలబడాలన్నారు. మీ పనితీరు కారణంగా పార్టీ మరింత విస్తరించే విధంగా ఉండాలని, నిధులు, విధుల విషయంలో క్రమశిక్షణా యుతంగా వ్యవహరించాలని నారాయణ సూచించారు. ప్రస్తుతం ప్రపంచాన్ని జయించాలనే విధంగా మోడి వ్యవహరిస్తున్నారని, పరాయి దేశాల పాలనలో తలదూర్చడమే కాక తాము నిర్ణయించిన వారే పాలకులుగా ఉండాలని మోడి అజ్ఞాపిస్తున్నాడని ఆయన తెలిపారు. మిగతా 2లో..

## ఖమ్మంలో సినీ నటి శ్రీలీల సందడి



**-ఘనంగా మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం**
**-నమ్మకానికి మారుపేరు మాంగళ్య**
**-మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడిని సృష్టిస్తూ వేగంగా విస్తరిస్తూ నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ ప్రజల అదరాభిమానాలు పొందిన మాంగళ్య షాపింగ్ మాల్ ఇప్పుడు ఖమ్మంలో 30వ శాఖను ఘనంగా ప్రారంభించింది. శుక్రవారం ఈ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సినీ నటి శ్రీలీల హాజరై జ్యోతి ప్రజ్వలన, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వస్త్ర వ్యాపార రంగంలో దశాబ్దాల అనుభవంతో నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు మాంగళ్య షాపింగ్ మాల్ అందిస్తుందని తెలిపారు. మూడు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల్లో ప్రజలకు అత్యుత్తమమైన మిగతా 2లో..

# గెలుపు మార్పుకు నాంధి పలకాలి

(మొదటిపేజీ తరువాయి)

పనిచేసే విధంగా స్థానిక ప్రభుత్వాలు రూపుదిద్దుకున్నాయని కోదడం రామ్ తెలిపారు. మనల్ని మనమే పరిపాలించుకునే విధానంతోపాటు అధికారమార్పిడి కూడా ప్రారంభమైందన్నారు. ఓట్లు వేసే అధికారం రావడం, అన్నింటికీ మించి సర్వజనీన వయోజన ఓటు హక్కుతో మార్పులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. రాజ్యాంగానికి లోబడి పాలన జవాబుదారీతనంతో కూడిందై ఉండాలన్నారు. కీలక నిర్ణయాల్లో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం ద్వారా ఓ మంచిపాలన అందించొచ్చని ఆయన సూచించారు. ప్రజలను భాగస్వామ్యం చేసే ప్రక్రియలో భాగంగానే కేంద్ర,రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయయన్నారు. 1992వ సం.లో వచ్చిన 73,74 రాజ్యాంగ సవరణ స్థానిక సంస్థలకు కొత్త అధికారాలను తీసుకొచ్చిందని, నేరుగా నిధులు రావడంతో పాటు ఎన్నికల నిర్వహణ తప్పని సరైందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయితీల్లో వ్యత్యాసాలు లేనివిధంగా అందరికీ సమాన హక్కులు కల్పించేందుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. మార్పు తథ్యమని, 1965వ సం. తర్వాత రైతాంగ ఉద్యమాల ఫలితంగా ప్రశ్నించే తత్వం ప్రారంభమైందని, ఆదిపత్య దోరణి స్థానే, రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. స్థానికంగా ఎన్నికైన వారు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రధానంగా నిధుల వినియోగంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అటువంటి రాజకీయాలను ప్రోత్సహించాలన్నారు. ప్రజలను శక్తిగా మార్చడం సమాజ వికాసం కోసం కృషి చేయడం ప్రజాప్రతినిధుల లక్ష్యం కావాలని ఆయన తెలిపారు. నిధులు, విధులలకు చైతన్యం తోడైతేని సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయన్నారు.

**రాజకీయాలే సమస్యగా మారాయి : ప్రొ. హరగోపాల్**

రాజకీయమం సమాజ సమస్యలను అర్ధం చేసుకుని పరిష్కరించడమని, కానీ ఇప్పుడు రాజకీయమే ఒక సమస్యగా మారిందని ప్రొ.హరగోపాల్ తెలిపారు. సిపిఐ ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో హర గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరగడం నైతికత లోపించడం తదితర కారణాలతో రాజకీయాలు కలుషితమయ్యాయని ఆయన అన్నారు. ప్రజా స్వామ్య పద్ధతుల్లో అధికారం అంటే సమాజం నుంచి పొందడం అని, అలాంటి అధికారాన్ని సమాజాభివృద్ధికి, ప్రజల జీవన విధానంలో మార్పుకు దోహదపడేలా కృషి జరగాలన్నారు. చైతన్యం ద్వారా మార్పు వస్తుందని, మార్క్స్ చెప్పినట్లుగా సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని ఆయన తెలిపారు. మానవసంబంధాల్లో మార్పులు త్వరిత గతిన సంభవిస్తున్నాయని, ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడంతో మానవ సంబంధాలు బలహీన పడి ఒక ప్రశ్నగా మారుతున్నాయన్నారు. ముందుగా మనిషి పరిపూర్ణ మానవునిగా ఎదగడమే గొప్ప మార్పు అని హరగోపాల్ స్పష్టం చేశారు. మనిషి సృష్టించిన సంపద సృష్టించిన వానికి దక్కడం లేదని, వేర్వేరు వ్యక్తుల వద్ద అది కేంద్రీకృతమవుతోందన్నారు. బలప్రయోగం రాజ్యాంగ లక్షణం అని తెలిపారు. ఈ సమాజం తల్లితండ్రి శిక్షించ లేక పోయినా రాజ్యాంగానికి శిక్షించే అధికారం ఇచ్చిందని ఆయన తెలిపారు. సమాజ మార్పు చైతన్యవంతమైన మనిషితో సమక్రమ మార్గంలో జరుగుతుందని హరగోపాల్ తెలిపారు. ఇప్పుడు స్వార్థమే మనిషిని నడుపుతోందని మానవ సంబంధాలు మానవీయంగా మారకపోతే మరింత ప్రమాదమన్నారు. కమ్యూనిస్టు ప్రతినిధుల ద్వారానే సమాజ మార్పు త్వరిత గతిన సాధ్యమవుతుందని హరగోపాల్ తెలిపారు. కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ గౌరవాన్ని ఇనుమడింప జేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మౌళిక వసతుల కల్పన, ముఖ్యమంగా విద్యావైద్యం, తాగునీరు తదితర విషయాలకు ప్రాధాన్యతనిచ్చి మన తర్వాత కూడా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పాలనే బాగుందనిపించేలా పాలన సాగాలన్నారు. ఈ శిక్షణ తరగతులను స్థానిక శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించగా, సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కే నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు,. మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెడవాడ వెంకటేశ్వర్లు, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రె బిక్షపతి, ప్రముఖ వైద్యులు సూర్యదేవర రామ్మోహన్ రావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సిద్దులు తదితరులు పాల్గొన్నారు. మునిగడప పద్మ, ఉమ, వాసిరెడ్డి మురళీ తదితరులు స్టీరింగ్ కమిటీగా వ్యవహరించారు.

# దేశంపై యుద్ధ ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

వెనుజుల దేశాధ్యక్షుడు, ఆయన భార్యను బందీ చేశాడని తెలిపారు. అలీన దేశంగా ప్రపంచంలో అతిపెద్ద దేశమైన భారత దేశంలో మోడి కారణంగా ఆబాసుపాలవుతోందని అన్నారు. దేశ ప్రధానిగా మోడి అమెరికా అధ్యక్షుడు ట్రంపు ముందు సాగిలపడుతున్నారన్నారు. విదేశీ విధానం విమర్శల పాలవుతుండగా, దేశంలో పాలన మరింతగా ప్రజలను పీడించే విధంగా ఉందన్నారు. కార్పోరేట్లకు కొమ్ముకాస్తూ ప్రజలపై భారాలను మోపుతున్నారని నారాయణ ఆరోపించారు. అదానీ లాంటి కార్పోరేట్ శక్తులకు మోడి సర్కార్ ఊడిగం చేస్తోందన్నారు. పేదప్రజల సమస్యలను విస్మరిస్తే తగు ఫలితం అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో పేదలు నివశిస్తున్న స్థలాలను క్రమబద్దీకరించి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,స్థానిక ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, కర్రె బిక్షపతి, మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర నలు మూలల నుండి సిపిఐ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లాలో రగులుతున్న పోడు వివాదం

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిన గిరిజనులపై అధికారులు దాడి చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం ఎన్నో ఏళ్లుగా పోడు సాగు చేస్తున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు బలవంతంగా ట్రెంచ్‌లు తవ్వుతున్నారని తెలిపారు. దీనిపై వివరణ కోరేందుకు వెళ్లిన గిరిజనులపై అధికారులు నిర్దాక్షిణ్యంగా దాడి చేయడంతో ఒక గిరిజనుడు తీవ్రంగా గాయపడినట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికే ఎండాకాలం కారణంగా వ్యవసాయానికి నీటి కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో తమ పంట పొలాల్లోకి వచ్చి ట్రెంచ్‌లు తవ్వడం వల్ల మరింత నష్టపోతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా అడవులను నరికిపోడు సాగు చేస్తే చర్యలు తీసుకోవడం సరే కానీ, సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూముల్లో ఇలా దౌర్జన్యంగా ట్రెంచ్‌లు తవ్వడం సరైంది కాదని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయంపై పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు జోక్యం చేసుకుని ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని బట్టుగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు కోరుతున్నారు

## బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంతంగి మారుతి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.వి. కృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ ఈ నెల 15న నిర్వహించనున్న విద్యార్థి ఫీజు పోరు దీక్షను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు బత్తిని మధు గౌడ్ మాట్లాడుతూ బీసీ కుల గణన కోసం ఈ నెల 23న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు అధ్యక్షులను నియమించినట్లు ప్రకటించారు. సత్తుపల్లి మండలం అధ్యక్షుడిగా దేవల్ల కొండలరావు, వేంసూరు మండలం అధ్యక్షుడిగా చెల్లు మణికంఠ, పెనుబల్లి మండలం అధ్యక్షుడిగా పుచ్చకాయల శ్రీను, కల్లూరు మండలం అధ్యక్షుడిగా మరీదు మురళి గౌడ్, తల్లాడ మండలం అధ్యక్షుడిగా ఎనీక శ్రీనివాసరావును నియమించారు. అదేవిధంగా సత్తుపల్లి నియోజకవర్గ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా తెలగరపు సతీష్ కుమార్‌ను నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్వర చారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా గౌరవ సలహాదారు పద్మాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు మక్కల వెంకన్న, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాసాల సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చిన్నంశెట్టి వెంకట రామ కృష్ణ, కోశాధికారి గునిగంటి వీరన్న, జిల్లా కార్యదర్శి కుందారపు సుధాకర్, ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.సమావేశం అనంతరం కార్యకర్తలు సంఘం బలోపేతానికి కలిసి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



## పదో తరతి పరీక్షా కేంద్రం పరిశీలన

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ నాల్గో వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్‌కు శుక్రవారం వైరాలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు శనివారం నుండి ప్రారంభంకానున్న నేపద్యంలో పాఠశాలకు వెళ్లి అక్కడ వసతులను గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ డోజర్ పెట్టి పనులు చేపించి పలు సూచనలు చేశారు. విద్యార్ధులకు త్రాగునీటి ఏర్పాటుతో వైద్య సేవలు అందేవిధంగా చూడాలని, విద్యార్ధులు వెలుతురులో పరీక్షవ్రాసే విధంగా ఏర్పాట్లు ఉండాలని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో రత్నాకర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలో 13వ వార్డు శుక్రవారం జరిగిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆ వార్డు కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి విజయ సీతారాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో పరిశుభ్రత కార్యక్రమాలను పరిశీలించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారించేందుకు ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిరియాల శ్రీనివాస రావు, బానోతు విజయ, అక్కిశెట్టి పూర్ణ, అక్కిశెట్టి నాగు, మొరం రామ్మూర్తి, బొడ్డుపల్లి కృష్ణయ్య, గ్రామదీపిక దుర్గాభావాని, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మంలో సినీ నటి శ్రీలీల సందడి

(మొదటిపేజీ తరువాయి)

వస్త్రాలను అందిస్తున్నారన్నారు. మాంగళ్య యాజమాన్యం పిఎన్ మూర్తి, కాసం నమఃశివాయ బ్రదర్స్ కలిసి కృష్ణా జిల్లాగా వస్త్ర వ్యాపారం చేస్తున్నారన్నారు. త్వరలో తమిళనాడు రాష్ట్రంలో కూడా మాంగళ్య షాపింగ్ మాల్ విస్తరించనున్నారన్నారు. సినీ నటి శ్రీలీల మాట్లాడుతూ ఖమ్మం ప్రజలు మాంగళ్య షాపింగ్ మాల్‌ను ఆదరిస్తారని నమ్మకం ఉందన్నారు. ఖమ్మం ప్రజల ఆశీర్వాదలతో ఈ మాల్ మరింత విజయవంతమవుతుందన్నారు. వస్త్ర ప్రియులకు నూతన మోడల్స్‌ను ఎప్పటికప్పుడు అందిస్తూ మాంగళ్య ప్రజల అభిమానాన్ని చూరగొందన్నారు. మూడు రాష్ట్రాల్లో ఇది విస్తరించిందని 30వ షాపును ఖమ్మంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మాంగళ్య షాపింగ్ మాల్‌లో వస్త్రాలు కొనుగోలు చేయాలని శ్రీలీల తెలిపారు. ఉగాది రోజే తాను నటించిన ఉస్తాద్ భగత్‌సింగ్ విడుదలవుతుందని దానిని కూడా ఆదరించాలని తెలిపారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు పుల్లూరు నర్సింహమూర్తి, కాసం నమః శివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ లు మాట్లాడుతూ ప్రతి వర్గానికి, ప్రతి సందర్భానికి అనువైన నాణ్యమైన వస్త్రాలను అందుబాటు ధరలో అందించడమే మాంగళ్య షాపింగ్ మాల్ విజయ రహస్యమని తెలిపారు. మా సొంత హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఆధునీక మార్కెట్ ట్రెండ్స్‌కు అనుగుణంగా డిజైన్ చేసి వస్త్ర వ్యాపారంలో ముందంజలో ఉన్నామన్నారు. మాంగళ్య షాపింగ్ మాల్‌లో పురుషులు, యువత, పిల్లల కోసం తాజా ఫ్యాషన్ కలెక్షన్స్, వివాహాలు, ఇతర శుభ కార్యలకు ప్రత్యేకమైన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మా వద్ద రూ. 99 నుంచి లక్ష వరకు ధరల శ్రేణి వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మాంగళ్య షాపింగ్ మాల్ ఒక సంపూర్ణ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో విజయవంతంగా కొనసాగుతుందన్నారు. త్వరలోనే తమిళనాడులో కూడా విస్తరించనున్నట్లు తెలిపారు. ఖమ్మం ప్రజలు కూడా మాంగళ్య షాపింగ్ మాల్‌ను ఆదరిస్తారని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, స్థానిక కార్పొరేటర్ సరిపూడి రమాదేవి సతీష్, పలువురు పుర ప్రముఖులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**సినీ నటి శ్రీలీల సందడి...**

మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఖమ్మం విచ్చేసిన సినీ నటి శ్రీలీల సందడి చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అభిమానులు శ్రీలీలను చూసేందుకు తరలి వచ్చారు. షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన అనంతరం అభిమానులకు నమస్కరించి చేతులు ఊపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపింది. అభిమానులతో కలిసి సెల్ఫీలు దిగి సందడి చేసింది. భారీగా అభిమానులు తరలి రావడంతో ఆ ప్రాంతమంతా జన సందోహంతో నిండిపోయింది.

## మన పరిసరాల పరిశుభ్రతతోనే మన ఆరోగ్యం

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ ఐదో వార్డులో శుక్రవారం ఆ వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా డ్రైడై ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న పలు గృహాల్లో టైర్లలో ఉన్న నీరును చిన్న హౌస్‌లలో నిరుపయోగం ఉన్న నీరును మున్సిపల్ సిబ్బందితో కలిసి తొలగించారు. అదేవిధంగా డ్రైనేజీల్లో ఉన్న వ్యర్ధాలు తొలగించే విధంగా మున్సిపల్ సిబ్బందికి సూచన చేశారు. ఈ సందర్భంగా కటా టస్వరూపరాణి మాట్లాడుతూ మనందరం మంచిగా ఉండాలి. మన పిల్లలు మంచిగా ఉండాలి అంటే ముందు మనం ఆరోగ్యంగా ఉండాలి. మన ఆరోగ్యం మంచిగా ఉంటే మనం ఏదైనా చేయగలం. అలా ఆరోగ్యం మంచిగా ఉండాలి అంటే మన పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండాలి. అలా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరిని అని ఆమె తెలిపారు. నీరు నిల్వ లేకుండా ఉంటే ఎలాంటి వ్యాధులు రావు అన్నారు. దోమల నివారణ కోసం లార్వాను స్ప్రే చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



# సమస్యలపై గళమెత్తిన సిపిఐ కౌన్సిలర్లు

**- పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం : కమిషనర్ మున్వర్అలీ**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పెద్దతండాలోని 26వ వార్డులో గల ఏదులాపురంమున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించన కౌన్సిల్ మీటింగ్‌లో సిపిఐ కౌన్సిలర్లు పలు సమస్యలపై గళమెత్తారు. ఈ సందర్భంగా 28వ డివిజన్ కౌన్సిలర్ దండి రంగారావు మాట్లాడుతూ..చెత్త తరలింపుపై ప్రత్యేక దృష్టిని కనబరచి వాహనం వెంట ఓ హెల్పర్‌ను పెట్టాల్సిందిగా సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఏదులాపురంలోని చెరువును పరిరక్షించాల్సిందిగా కోరారు. దీనిని వాకింగ్ ట్రక్‌గా ఏర్పాటు చేయడంతో పాటు రిజర్వాయర్‌గా చేస్తే మంచినీటి ఇబ్బంది ఉండదన్నారు. తూముల ద్వారా నీరు వృథాగా పోతుందని, తక్షణమే దానిని నిలుపుదల చేయాల్సిందిగా కోరారు. లేని పక్షంలో గ్రౌండ్ వాటర్ తగ్గి బోర్లు ఎండిపోయి మంచినీటి కటకట ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 32డివిజన్‌లలో విద్యుత్‌శాఖ నుంచి సమస్య ఉందని, ఓ ఇంట్లో ఇద్దరు, ముగ్గురు, నాలుగురు అన్నదమ్ముల్లు ఉంటే ఒక్కరికి మాత్రమే మీటర్ ఇస్తున్నారన్నారు. ఇలా చేయడం వలన కరెంట్ లేక మిగత వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున తక్షణమే తీర్మానం చేసి వారికి కూడా మీటర్ ఇచ్చేలా చొరవ చూపాలని కోరారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు అన్ని ఇండ్లకు లేవని, తక్షణమే దానిని పరిష్కరించాలన్నారు. 30వార్డు కౌన్సిలర్ దండి శ్రీజ మాట్లాడుతూ...డిబిర్‌నగర్ 1,2,3లలో ట్రాన్స్‌ఫర్మర్ ఇబ్బందితో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలిపారు. అలాగే కోతులు, పందుల బెడదతో ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఆటోనగర్‌లోకాలనీలోకి వచ్చే ప్రధాన మట్టిరోడ్డు గుంతలమయంగా మారిందని, వీలైనంత త్వరగా దానికి మోఖం కలిగించాలని కోరారు. 32వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ...తమ ప్రాంతంలో డంపింగ్‌యార్డ్ సమస్య తీవ్రతరంగా ఉన్నట్లు తెలిపారు. ఇక్కడి స్మశానవాటిక కోసం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తన సొంత డబ్బులు రూ.10లక్షలు వెచ్చించారన్నారు. అటు తర్వాత అందుల్లో ఏర్పాటు చేసిన వైకుంఠధామం డంపింగ్ ఏర్పాటుతో చెత్త మయంగా మారిందన్నారు. కావున తక్షణమే స్పందించి అక్కడ పరిస్థితిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ప్రతి ఒక్క సమస్యను నోట్ చేసుకున్నామని, పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

**- గంజాయి విక్రయించిన, సేవించిన జైలుకే**
**- పిడిఎస్ బియ్యం విక్రయిస్తే పిడి యాక్ట్ నమోదు**
**-విలేకరుల సమావేశంలో వైరా ఎసిపి ఎస్.సారంగపాణి**



**ప్రజాపక్షం/మధిర :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇసుక రవాణా ప్రభుత్వ నిబంధనలకు లోబడి రవాణా చేయాలని, అలాకాకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఇసుక ట్రాక్టర్లపై, సంబంధిత యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని వైరా ఎసిపి సారంగపాణి హెచ్చరించారు. శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఎసిపి సారంగపాణి మాట్లాడుతూ ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మధిర నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. రాష్ డ్రైవింగ్ చేసిన, త్రిబుల్ రైడింగ్ చేసిన, లైసె న్స్, ఆర్‌సి, హెల్మెట్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపిన అలాంటి వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా వైరా డివిజన్ పరిధిలో గంజాయి తాగినా, అమ్మకాలు చేపట్టిన అలాంటివారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరిగే సమాచారాన్ని ప్రజలు ఇస్తే సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వటం జరుగుతుందని వారు తెలిపారు. ముందుగా ఇసుక రవాణా చేసే వారితో అవగాహన సమావేశం ఏర్పాటు చేసి వారికి తగిన సూచనలు ఇవ్వటం జరుగుతుందని, ఆ తర్వాత ఇసుక అక్రమ రవాణా జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముందుగా మధిర రూరల్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో వైరా ఎసిపి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎసిపి అన్నారు. చెట్టు నాటడం ద్వారా ప్రకృతి కాపాడుకోవచ్చని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో మధిర సిఐలు మధు, రమేష్, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం

**జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల**



**ప్రజాపక్షం/చింతకాని :** తెలంగాణలో రైతులకు మద్దతు ధర కల్పించడంలో, కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. శుక్రవారం చింతకాని మండలం నాగులవంచలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా చింతకాని, బోనకల్ మండలాల రైతులు మొక్కజొన్న సాగు చేస్తారని, కొనుగోలు కేంద్రాలు నేటి వరకు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రూ.1600 కే కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలన్నారు. కరోనా సమయంలోనూ కేసిఆర్ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు ఇవ్వకుండా రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల హామీలు సైతం ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో రైతుల పక్షాన బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకలు మంకెన రమేష్ మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్ నాయకులు గడ్డం శ్రీను, వంకాయలపాటి లచ్చయ్య, బండి రామారావు, వేముల నర్సయ్య, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు

**6 సెంటర్లు, 1233 మంది విద్యార్థులు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నేటి నుండి ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మండలంలోని 6 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,233 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు 35 మంది ప్రైవేట్ విద్యార్థులు కూడా ఉన్నారని, మండలంలోని పరీక్షా కేంద్రాల వారీగా విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి.... జ్యోతి నిలయం పరీక్షా కేంద్రంలో 119 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 280 మంది, గర్ల్స్ హై స్కూల్‌లో 190 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇదే కేంద్రంలో 35 మంది ప్రైవేట్ విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరవుతారు. అదేవిధంగా జడ్‌పిహెచ్‌ఎస్ సత్తుపల్లి కేంద్రంలో 285 మంది, జడ్‌పిహెచ్‌ఎస్ ఎన్టీఆర్ నగర్‌లో 180 మంది, జడ్‌పిహెచ్‌ఎస్ గంగారం కేంద్రంలో 144 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని నిబంధనలు పాటిస్తూ పరీక్షలు రాయాలని సూచించారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/చింతకాని :** శనివారం నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరిక్షలకు చింతకాని మండలంలో 467 మంది విద్యార్ధులు హాజరుకానున్నట్లు మండల విద్యాశాఖాధికారి సతాది రామారావు తెలిపారు. నాగులవంచ, పందిళ్లపల్లి , చింతకాని పరిక్షా కేంద్రాల్లో 383 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, 84 మంది ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పరిక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్ధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిక్షలకు సంబందించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ పరిక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. పరిక్ష కేంద్రాల వద్ద 163 బి ఎన్ ఎస్ యాక్ట్ అమల్లో ఉంటుందన్నారు.

## ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**ప్రజాపక్షం/చింతకాని :** మండలంలోని చిన్నమండవ, తిమ్మినేనిపాలెంతో పాటు ముదిగొండ మండలం వల్లాపురం మున్నేటి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను వైరా సిఐ వెంకటప్రసాద్ పట్టుకున్నారు. మున్నేటి నుంచి ఇసు అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆయన శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లలను సీజ్ చేసి చింతకాని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో చింతకాని ఎస్సై వీరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడిపడితే అక్కడ వేయకూడదని మున్సిపల్ కమీషనర్ సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 14, 21 వార్డుల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను కమీషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఉంచి మున్సిపల్ సిబ్బందికి ఇవ్వాలని తెలిపారు. 21వ వార్డు కౌన్సిలర్ రంగా రూప మాట్లాడుతూ వార్డులో ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కోట నాగరాజు, కాంగ్రెస్ నాయకులు యర్రగుంట కమలాకర్, కమతం ప్రవీణ్, షేక్ బాబు, మెప్మా వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని కోయచలక ఉన్నత పాఠశాలలో మాజీ సర్పంచ్ మాధంశెట్టి హరిప్రసాద్ ఆధ్వర్యంలో గద్దల నాగరాజు, గుగులోత్ హరికృష్ణ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు, స్కేల్, ఇతర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మాధంశెట్టి హరి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శిరీష అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కవయిత్రి మొల్ల విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్ల విగ్రహాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ఆవిష్కరించారు. ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కవయిత్రి మొల్ల తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సాధించారని తెలిపారు. రామాయణాన్ని సాధారణ ప్రజలకు సులభంగా అర్థమయ్యేవిధంగా తెలుగులో అందించారని పేర్కొన్నారు. ఆమె రచనలు తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, సరిపూడి రమాదేవి సతీష్, పలు సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ అప్రెంటిషిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్టిసి) ఖమ్మం రీజియన్‌లో గ్రాడ్యుయేట్ అప్రెంటిషిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ శుక్రవారం తెలిపారు. బికాం, బియస్సి, బిబిఎ, బిఎ, ఇంజనీరింగ్, డిప్లొమా వంటి డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అప్రెంటిషిప్‌కు అర్హులని తెలిపారు. 2021 తర్వాత డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు https://nats.education.gov.in ద్వారా ఆన్‌లైన్ లో చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ మార్చి 14 నుంచి మార్చి 23 వరకు ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం రీజియన్ పరిధిలోని డిపోలు, వర్క్‌షాపుల్లో అప్రెంటిషిప్ శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువు లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అప్రెంటిషిప్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని ఆర్ఎం సరిరామ్ తెలిపారు.

# ప్రజలకు మరోసారి షాకిచ్చిన కేంద్రం



ప్రజాపక్షం/మణుగూరు: కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ల బుకింగ్ గడువును మరోసారి పెంచింది. ఇప్పటికే పట్టణాల్లో సిలిండర్‌కు, సిలిండర్‌కు మధ్య కనీస గడువును 21 రోజుల నుండి 25 రోజులకు పెంచగా తాజాగా గ్రామాల్లోనూ నిబంధనలు విధించారు. గ్రామాల్లో కూడా సిలిండర్‌కు, సిలిండర్‌కు మధ్య కనీస గడువును 25 రోజుల నుండి 45 రోజులకు పెంచారు. ఈ కొత్త నిబంధన, అక్రమ నిల్వలను అరికట్టేందుకు, సరఫరాను క్రమబద్ధీకరించేందుకు అమలులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. దేశవ్యాప్తంగా గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.60 పెరిగింది. అలాగే హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలు వినియోగించే కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.115 పెరిగింది. ఈ పెంపు వెంటనే అమల్లోకి రావడంతో వినియోగదారులు అదనపు భారం భరించాల్సి వస్తోంది. హైదరాబాద్‌లో గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.965/గా ఉంది. ఇతర నగరాల్లో కూడా ధరలు ఇదే విధంగా పెరిగాయి. పశ్చిమాసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధ పరిస్థితుల వల్లే ఎల్పీజీ ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

# పద్మావతి కుటుంబాన్ని పరామర్శించిన పాయం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు మండలంలోని ఫిష్ మార్కెట్ ప్రాంతానికి చెందిన వడ్డే పద్మావతి ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పద్మావతి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. కుటుంబానికి ఈ కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, 14 టైర్ యూనియన్ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, సీనియర్ నాయకులు పోలమూరి రాజు, సామ శ్రీనివాస్ రెడ్డి, ఎస్. గణేష్ రెడ్డి, రామ్ రెడ్డి, పాతూరి వెంకన్న, బానోతు లక్ష్మణ్, చింతల కృష్ణ, మహబూబ్, వార్డు సభ్యులు బర్ల శ్వేతన్, వెంకట్రావు మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్ష కేంద్రాలు తనిఖీ



ప్రజాపక్షం/జూలూరుపాడు: పదవ తరగతి పరీక్షలకు మండలంలో రెండు సెంటర్లలో ఏర్పాట్లను మండల విద్యాశాఖ అధికారి బి జుంకీలాల్ పరిశీలించడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జూలూరుపాడు నందు 170 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. మరొక సెంటరు సెయింట్ ఆంటోని పాఠశాల నందు 150 మంది బాలి బాలికలు పరీక్ష రాయపోతున్నారు. మండలంలోని మొత్తం విద్యార్థులు సంఖ్య 350 మంది కాగా, అందులో బాలికలు 210 బాలురు 138 మంది ఈ రెండు సెంటర్లలో పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను సక్రమంగా ఉండేలా పర్యవేక్షించడం జరిగిందని ఎంఈఓ తెలిపారు. ఇన్విజిలేటర్ తో సిఎస్, డిపార్ట్మెంట్ ఆఫీసర్లతో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ రెండు సెంటర్లలో త్రాగునీరు, టాయిలెట్స్ ను 8మరియు విద్యుత్ సౌకర్యం అన్ని సౌకర్యాలను పర్యవేక్షించారు. పరీక్షలు సీసీ కెమెరా పర్యవేక్షణలో నిర్వహిస్తారని అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారి బి జుంకీలాల్ తెలిపారు.

# పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**-ఎంఈఓ కొమరం శాంతారావు**



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మండల కేంద్రంలో మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని మౌలిక సదుపాయాలతో పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ కొమరం శాంతారావు తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా ఆళ్లపల్లి జెడ్పిహెచ్ఎస్ నుండి 16 మంది, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నుండి 48 మంది, మర్కోడు జెడ్పిహెచ్ఎస్ నుండి 8 మంది, మర్కోడు ఆశ్రమ గిరిజన పాఠశాల నుండి 18 మంది, అనంతోగు బాలికల ఉన్నత పాఠశాల నుండి 34 మంది విద్యార్థులు మొత్తం 124 మంది పరీక్షలకు హాజరవుతున్నారని వివరించారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బంది, 108 అంబులెన్స్, త్రాగునీరు. మరుగుదొడ్లు తదితర సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు 144 సెక్షన్ అమలు చేస్తూ పోలీస్ సిబ్బందిని కూడా నియమించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని, శాతం వంద ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.

# వెలుగుమట్లలో వసతుల కల్పనకు శ్రీకారం

**-యుద్ధ ప్రాతిపదికన విద్యుత్, తాగునీటి ఏర్పాట్లు**







ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు కేటాయించిన నివాస స్థలాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. నివాస స్థలాలు పొందిన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ఇటీవల వెలుగుమట్లలో ఇండ్లు కోల్పోయిన బాధితులు 311 మందికి అక్కడే 75 గజాల చొప్పున నివాస స్థలాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు లు పంపిణీ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు నివాస స్థలాలతో పాటు ఇండ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ పథకం క్రింద ఐదు లక్షలను మంజూరు చేశారు. వెలుగుమట్లను మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని మంత్రులు సూచించారు. లబ్ధిదారులకు మంజూరైన ఇండ్లను నిర్మించుకునేందుకు అక్కడ వసతులు లేకపోవడంతో అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకుంది. ఇప్పటికే 38 మంది లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకోగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని మోడల్ కాలనీగా తీర్చిదిద్ది అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని ఆ దిశగా పనులు వెంటనే ప్రారంభించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అందులో భాగంగా శుక్రవారం అధికార యంత్రాంగం అక్కడ ఇంటింటికి శుద్ధి చేసిన త్రాగునీటిని అందించేందుకు పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టారు. అదేవిధంగా విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ లైన్ ఏర్పాట్లను ప్రారంభించారు. రహదారులతో పాటు త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, తెలంగాణ పబ్లిక్ స్కూల్, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి మౌలిక సదుపాయాలను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నారు.

# మణుగూరు ఓసి-2 డీప్ సైడ్ గనిపై ఉత్కంఠ

**సింగరేణికే దక్కాలంటూ కార్మికుల ఆందోళన**

ప్రజాపక్షం/మణుగూరు: 135 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఓసి2 డీప్ సైడ్ గని కీలకమైన ఆస్తిగా భావిస్తున్నారు. అధిక నాణ్యత గల బొగ్గు నిల్వలు ఉన్న ఈ గని సింగరేణి భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. సెంట్రల్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న ఈ బ్లాక్‌లో సుమారు 20 సంవత్సరాలకు పైగా బొగ్గు నిల్వలు ఉన్నట్లు అంచనా. ఇదే సమయంలో ఈ గనిపై వేలం ప్రక్రియలో తెలంగాణ జెన్‌కో రంగంలోకి దిగడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే జెన్‌కోకు సింగరేణికి సుమారు 17,757 కోట్లకు పైగా బకాయిలు ఉన్నట్లు సమాచారం. డిస్కంలతో కలిపితే ఈ బకాయిలు 43,000 కోట్లకు పైగా ఉంటాయని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణికి బొగ్గు కొనుగోలు చేసిన డబ్బులు కూడా చెల్లించలేని జెన్‌కో, ఇప్పుడు అదే సింగరేణితో వేలంలో పోటీ పడటం కార్మిక సంఘాలు, స్థానిక నాయకుల్లో సందేహాలు రేకెత్తిస్తోంది. 2020 తర్వాత కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను కేటాయింపు పద్ధతిలో కాకుండా వేలం విధానంలోనే కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో జెన్‌కో పోటీ పడటానికి వెనుక రాజకీయ వ్యూహం ఉందా? లేక ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి ఈ గని వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నమా? అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సింగరేణి కార్మిక సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం ఒకే మాట చెబుతున్నారు





"మన బొగ్గు మనకే దక్కాలి."

ఈ గని సింగరేణికి దక్కకపోతే సంస్థ ఆదాయం తగ్గడమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా తగ్గిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక సింగరేణికి రావాల్సిన బకాయిలు చెల్లించకుండా, కొత్త గనులు కూడా దక్కకుండా చేయడం సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నమేనని కార్మికులు వాదిస్తున్నారు. మణుగూరు గని సింగరేణికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. మొత్తానికి మణుగూరు ఓసి2 డీప్ సైడ్ గని ఎవరికి దక్కుతుందనే అంశం ప్రస్తుతం సింగరేణి వర్గాలు, కార్మికులు, స్థానిక ప్రజల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ గని సింగరేణికే దక్కితేనే ప్రాంత అభివృద్ధి, కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పచ్చని చెట్లపై కౌన్సిలర్ ప్రతాపం

**- సమాచారం లేకుండా తొలగింపుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఇంటి యజమానురాలు**
**- ఘటనపై అధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్న వైనం**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : సహజంగా కౌన్సిలర్‌గా ఏర్పాటైన వారు తమ ప్రాంతంలో అభివృద్ధిపై దృష్టి పెడుతుంటారు. కానీ ఆ కౌన్సిలర్ మాత్రం ఓ ఇంటి ముందున్న పచ్చని చెట్లపై పగబట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏదులాపురంమున్సిపాలిటీ 25వ వార్డులో నారాయణరావు సుమారు 40సంవత్సరాలుగా ఉంటున్నారు. ఆయన సతీమణి ఇంటి ముందు చెట్లను 25సంవత్సరాలుగా తమ పిల్లల్లా పెంచుతుంది. అవి కూడా పూల మొక్కల చెట్లు కాగా ఆ పూలను బతుకమ్మ, ఇంటిలో పూజకు వినియోగిస్తుంటారు. అయితే కౌన్సిలర్ చేసిన వ్యవహారం ఇప్పుడు వివాదానికి దారి తీసింది. ఎటువంటి సమాచారం లేకుండా పచ్చని మొక్కలను తొలగించడంపై ఆగ్రహ ఆవేశాలు పెల్లుబీకుతున్నాయి. ప్రత్యేకంగా మున్సిపాలిటీ సిబ్బందికి చెప్పి మరి వాటిని తొలగించడంపై మండిపడుతున్నారు. కావాలనే కక్షపూరితంగా మొక్కలను తొలగింపు చేపించాడని ఆ ఇంటి యజమానురాలు ఆరోపిస్తోంది. ఇది వార్డులో చర్చగా మారడంతో అధికారులు జోక్యం చేసుకోవాలని ముక్త కంఠంతో నినదిస్తున్నారు. అలాగే పర్యావరణ నిబంధనల అతిక్రమనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ ఉదాంతంపై కౌన్సిలర్ కడవ నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా...ఈ సమస్య రెండు సంవత్సరాలపై బడి ఉందని, ఆ మొక్కలు రోడ్డుపై ఉన్నాయన్నారు. నేనే స్వయంగా ఇంటి వద్దకు వెళ్లి వాటిని తొలగించాలని కోరినప్పటికీ వారు వినలేదన్నారు. ఫిర్యాదులో నేపథ్యంలో వర్కర్స్‌తో తొలగింపు చేపించినట్లు పేర్కొన్నారు.

# మార్చి చివరి నాటికి లక్ష ఇందిరమ్మ ఇండ్లు పూర్తి

**-అర్హులైన పేదలందరికీ ఇండ్లు మంజూరు చేస్తాం**
**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





ప్రజాపక్షం/కామేపల్లి: రాష్ట్రంలో మార్చి చివరి నాటికి లక్ష ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కామేపల్లి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా జాస్తిపల్లిలో గ్రామంలో రూ 3.15 కోట్లతో జాస్తిపల్లి నుండి కెప్టెన్ బంజర వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, లాల్యతండ గ్రామంలో రూ 3.33కోట్లతో లాల్యతండ ఆర్అండ్‌బి రోడ్డు నుండి జగన్నాథతండ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే ఊటుకూరు గ్రామంలో ముత్యాలంపాడు గుడి నుండి శ్మశాన వాటిక వరకు రూ 1.80 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, తాళ్లగూడెం గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డు నుండి డోర్నకల్ ఆర్అండ్‌బి రోడ్డు వరకు పింజరిమడుగు, పాతలింగల మీదుగా రూ 4.20కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు. అదే విధంగా ముచ్చర్ల, పింజరమడుగు గ్రామాల్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను అవహేళన చేస్తూ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి రెండు సార్లు అధికారంలోకి వచ్చి కూడా పేదలకు ఇండ్లు నిర్మించలేదని విమర్శించారు. ముచ్చర్ల, పింజర మడుగు గ్రామాల్లో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందజేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష ఇండ్లు కూడా నిర్మించలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 4 లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. మార్చి చివరి నాటికి లక్ష ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి, ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఊటుకూరు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ కోరం కనకయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం మంజూరు చేసి అసంపూర్తిగా ఉంచిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు స్థానికంగా ఉన్న విద్యుత్ సమస్యలు, ఇతర మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# గోడౌన్లు నిర్మించారు..వదిలేశారు...!

**-18 నెలలుగా ప్రారంభం కోసం ఎదురు చూపులు**
**-ఆదాయం కోల్పోతున్న చేగొమ్మ సొసైటీ**



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామ వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ రిజిస్టర్ నెంబర్ 3850 సంఘానికి చెందిన గోడౌన్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభం కాకపోవడంతో సొసైటీ ఆర్థికంగా నష్టపోతున్న పరిస్థితి నెలకొంది. నాబార్డు వారి ఆర్థిక సహాయంతో సుమారు 1.51కోట్ల రూపాయలతో 1000మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యంతో రెండు గోడౌన్లను నిర్మించినప్పటికీ, గత 18 నెలలుగా అవి వినియోగంలోకి రాకపోవడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది.

### నాబార్డు సహాయంతో నిర్మాణం...

వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ యొక్క ఉపమార్కెటింగ్ సదుపాయాల కింద ఈ సహాయము చేయడం జరిగింది. ఇంకా భారత ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ స్కీమ్ ఫర్ అగ్రికల్చర్ మార్కెటింగ్(ఐఎస్ఏఎం)కింద ఈ నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామంలోని రైతులకు పంట నిల్వ సౌకర్యం కల్పించేందుకు నాబార్డు వారి ఆర్థిక సహాయంతో రెండు ఆధునిక గోడౌన్లను నిర్మించారు. ఒక్కో గోడౌన్ సుమారు 1000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉంది. నిర్మాణ పనులు పూర్తయి చాలా కాలం గడిచినా ఇప్పటి వరకు అధికారకంగా ప్రారంభించలేదు.

### ఖాళీగా ఉన్న గోడౌన్లు...

గోడౌన్లు వినియోగంలోకి రాకపోవడంతో అవి ఖాళీగానే ఉండిపోతున్నాయి. దీంతో రైతులు తమ పంటలను సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు. ధాన్యం నిల్వ కోసం రైతులు ప్రైవేట్ గోడౌన్లు లేదా ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సి వస్తోంది.

### సొసైటీకి ఆదాయం నష్టం...

ఈ గోడౌన్లు ప్రారంభమైతే అద్దె రూపంలో సొసైటీకి మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా రైతులు నుండి ఇంకా సివిల్ సప్లై, రైస్ మిల్లులు, జిన్నింగ్ మిల్స్, మార్క్ఫెడ్ మొదలైన వారి నుండి ఆదాయం వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ 18 నెలలుగా ప్రారంభం కాకపోవడంతో సొసైటీకి వచ్చే ఆదాయం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో సంఘం ఆర్థిక పరిస్థితిపై కూడా ప్రభావం పడుతున్నది.

### త్వరగా ప్రారంభించాలని డిమాండ్...

గోడౌన్లను వెంటనే ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక రైతులు, అధికారులను కోరుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి త్వరగా ప్రారంభిస్తే రైతులకు ఉపయోగం కలుగుతుందని సొసైటీ పరిధిలోని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# ఘనంగా కవయిత్రి మొల్ల 585వ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/అశ్వాపురం: ప్రముఖ తెలుగు రామాయణ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల)585వ జయంతి సందర్భంగా అశ్వాపురం మండల కేంద్రంలోని మల్లమ్మ సెంటర్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్లెల ఉషారాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉషారాణి మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన మొల్ల రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. మహిళలు విద్యా, సాహిత్య రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పినపాక నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డు పల్లవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆమె రచనలను తెలుగు పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో భద్రాద్రి జిల్లా అధ్యక్షులు బాడిస శంకర్రావు, మండల కుమ్మి సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రాము, గంగాధర కృష్ణ, కోటేశ్వరరావు, రేణుక, నాగరాజు, సూర్యారావు, మహిళా సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణి మృతి

**-మౌలిక వసతుల లేమిపై సీపీఐ ఆగ్రహం**



ప్రజాపక్షం/బూర్గంపాడు: మేజర్ గ్రామ పంచాయితీ సారపాక పరిధిలోని శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో విషాదం చోటు చేసుకుంది. ఆదివాసి గిరిజన మహిళ కోర్స జ్యోతి(24)ఆరు నెలల గర్భిణీ కాగా అనారోగ్యంతో మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)సారపాక పట్టణ కార్యదర్శి పేరాల శ్రీనివాసరావు ఆమె స్వగృహానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో గత 25 సంవత్సరాలుగా గిరిజనులు అడవిలోనే చీకటిలో జీవిస్తున్నారని, అక్కడ ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో దోమల కాట్లతో పాటు అనారోగ్య సమస్యల వల్ల పలువురు గిరిజనులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికీ ఆ గ్రామంలో కనీసం ఆశా వర్కర్, అంగన్వాడీ కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అతి సమీపంలో ఐటీడీఏ కార్యాలయం ఉన్నప్పటికీ గిరిజనుల సమస్యల పట్ల అధికారులకు ఆసక్తి కనిపించడం లేదని విమర్శించారు. గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పాటైన ఐటీడీఏ సంస్థ కనీస మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ పార్టీ ఆరోపించింది. మృతి చెందిన జ్యోతి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సమాయం అందించడంతో పాటు శ్రీరాంపురం ఎస్టీ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఆశా వర్కర్, అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. గిరిజన గ్రామాలకు మౌలిక వసతులు కల్పించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలకు సిద్ధం


**-కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో అశోక్**



ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లను స్థానిక ఎంపీడీవో బయ్యారపు అశోక్, ఎంఈఓ సురయ్య కలిసి పరిశీలించారు. శుక్రవారం పాఠశాలను సందర్శించిన వారు పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు త్రాగునీటి సౌకర్యం, ఫ్యాన్లు, తగిన వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. పరీక్షలు నిర్వహించే తరగతి గదులను పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల సమయంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పరీక్షా కేంద్రం వద్ద ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డాక్టర్ వెంకట ప్రసాద్‌కు సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉప సర్పంచ్ రామకృష్ణ, రాయల రమేష్, ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ కౌసర్, తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం ఆహారం అందించాలి

**-బాలుర వసతి గృహం, జెడ్‌పి హైస్కూల్‌లో భోజనాలపై పరిశీలన**



ప్రజాపక్షం/చంద్రుగొండ: మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఎంపీడీవో బయ్యారపు అశోక్, చంద్రుగొండ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాలపై వారు పరిశీలించారు. 99 రోజుల ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా పాఠశాల, వసతి గృహంలో ఉన్న వసతులను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, వసతి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాల్సిందిగా సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిఓ ఖాన్, పంచాయితీ కార్యదర్శి ప్రశాంత్, ఉప సర్పంచ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డిఈఓ



ప్రజాపక్షం/పాల్వంచ : పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని డిఈఓ బి. నాగలక్ష్మి అన్నారు. పాల్వంచ మండలంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా అన్ని పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు, సరైన విద్యుత్, టాయిలెట్స్ తదతర అన్ని సదుపాయాలను కల్పించటానికి అవసరమైన ఏర్పాట్లను చేయాలని సిఈఓ. డిఇఓ సంభందిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు రాసేందుకు తగిన వసతులు ముందస్తుగా ఏర్పాటు చేయాలని సూచించారు. డిఈఓ వెంట మండల విద్యాధికారి ఎం.శ్రీరామమూర్తి, ఎంపిఓ చెన్నకేశవులు, హెచ్ఎంఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూదాన్ భూముల్లో అర్హులందరికీ పట్టాలివ్వాలి




-ఇరాన్‌పై అమెరికా యుద్ధాన్ని భారత్ ఖండించాలి
-సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇరాన్ పై అన్యాయంగా, దుర్మార్గంగా అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని తీవ్రంగా ఖండించాల్సిన భారత్ భద్రత మండలిలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం దేశానికే అవమాన కరమని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. శుక్రవారం ఖమ్మం రామన ర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు, మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నర్సయ్య లు మాట్లాడుతూ ఇరాన్‌తో స్నేహ పూర్వక దేశంగా మన దేశం ఉండి ఆ దేశ సార్వభౌమాధికారాన్ని గుర్తించి బలపర్చకపో వడం, ఆ దేశ సుప్రీం లీడర్ అమతుల్లా ఖోమైని దారుణ హత్యను ఖండించకపోవడం అన్యాయమన్నారు. అదానీ కేసు అంబానీ పెట్టుబ డులకు అమెరికాలో లాభం చేకూర్చడం కోసం, ఎఫెన్ ఫైల్స్ లోగుట్టును మరుగునపర్చుకోవడం కోసం మోడీ ప్రభుత్వం ఈ వైఖరి అవలంభి స్తుందన్నారు. రష్యా నుంచి ఆయిల్ ను దిగుమతి చేసుకోవడానికి నెల రోజులు అమెరికా గడువు ఇవ్వడం చూస్తుంటే ఇది స్పష్టమవుతుంద న్నారు. ఇప్పటికైనా అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని భారత్ ఖండించి అక్కడ శాంతి నెలకొల్పడానికి కృషి చేయా లన్నారు. యుద్ధం పేరుతో గ్యాస్ ధరలను పెంచడాన్ని, బ్లాక్‌కు తర లించి కొరత సృష్టించడాన్ని నివారించాలన్నారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇండ్లు కూలగొట్టి తామే ఇండ్లు ఇచ్చామనే ప్రభుత్వ అధికారుల వైఖరి సరికాదన్నారు. అఖిలపక్ష పార్టీలు, సంస్థలు, వ్యక్తులు చేసిన పోరాట ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి అక్కడ 311 మందికి పట్టాలు ఇచ్చిందని వారు తెలిపారు. 2018 నుంచి అక్కడ నివసిస్తున్న చాలా మంది అర్హులకు పట్టాలు ఇవ్వలేద న్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అర్హులైన పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూములపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. పేదల కోసం ఇచ్చిన భూదాన్ భూములు లక్షల ఎకరాలకు పైగా రాష్ట్రంలో ఉందని ఆ భూములకు సంబంధించి శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, సివై పుల్లయ్య, జి. రామయ్య, ఆవుల అశోక్, మలీదు నాగేశ్వరరావు, కోలేటి నాగేశ్వరరావు, సిహెచ్ శిరోమణి, ఝాన్సీ, ఆవుల మంగతాయి, ఆజాద్, కె. శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

# 12 అంశాలపై తొలి కౌన్సిల్ సమావేశం




- రూ. కోటి ఆరులక్షల 60వేల వర్కులు చేసేందుకు ప్రతిపాదనలు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పెద్దతండాలోని 26వ వార్డులో గల ఏదు లాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని చైర్ పర్సన్ పోకబత్తిని అనిత అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సం దర్భంగా 202627 బడ్జెట్‌కు గాను 12 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా రూ. కోటి ఆరులక్షల 60వేల వర్కు లు చేసేందుకు ప్రతిపాదనలపై తీర్మానం చేశారు. ఎల్ఈడీ లైట్లు, పారి శుధ్య విభాగానికి చెందిన వాహనాల మరమ్మత్తు లు, స్మశానవాటికల అభివృద్ధి పనులతో పాటు పలు పనులపై ప్రతిపాదనలు తీసుకున్నారు. అలాగే మున్సిపాలిటీకి సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపులు, వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు ఆమోదం వంటి అంశా లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సి లర్లు దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, దండి శ్రీజ, బానోత్ దివ్య, శేషమ్మ, బుర్రా మహేష్, కదవ నవీన్ , ప్రసాద్, పూల్‌చంద్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**ప్రతిపాదనలు :**

1) 32వార్డులలో శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఎంగేజింగ్ ఆఫ్ జేసీబీ రూ.4లక్షలు, లేబర్ ఎంగేజ్ రూ.3లక్షలు
20 కొత్త ఎల్ఈడీ లైట్ల కొనుగోలు రూ.10లక్షలు
3) 32వార్డులలో హ్యాండ్‌పంప్ స్పేర్ పార్ట్స్ కొనుగోలు రూ.10లక్షలు
4) 32వార్డుల్లో లీకేజీ మెటీరియల్ కొనుగోలు రూ.10లక్షలు
5) గేట్‌వాల్స్ రిపేర్ కొరకు రూ.15లక్షలు
6) మోటర్స్ రిపేర్ రివైండింగ్ మెటీరియల్, ఇతర సామాగ్రి కొనుగోలు రూ.20లక్షలు
7) ఆటోసర్వీసింగ్, రిపేర్ల కొరకు రూ.10లక్షలు
8) లుంబినివనంలో కొత్తబోరు, మోటర్, పైప్‌లైన ఏర్పాటుకు రూ.13లక్షలు
9) పోలేపల్లి, ఏదులాపురం, బారుగూడెం, చిన్న వెంకటగిరి దంపింగ్‌యార్డ్ చెత్త తొలగింపుపై అంచనా రూ.10లక్షలు
10) పోలేపల్లి దంపింగ్‌యార్డ్ నందు సిసిరోడ్లు వేయుటకు అంచనా రూ.10లక్షలు
11) రాజీవ్‌గృహకల్పలోని ఇందిరమ్మ ఫేజ్2లో మోటార్లు, పైప్‌లైన్‌కు అంచనా రూ.3.50లక్షలు
12) రంజాన్ పర్వదినంలో భాగంగా టిఎన్‌జీఓస్ కాలనీ, మద్దులపల్లి ఈద్గాలో మౌలిక వసతుల ఏర్పాటు కోసం అంచనా

## 12వ వార్డులో క్లీన్ అండ్ గ్రీన్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధి లోని 12వ వార్డులో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు డ్రైనేజీ లను శుభ్రం చెపిచ్చే కార్యక్రమాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాదినేని సునీత మాట్లాడుతూ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్ర మంలో వార్డును శుభ్రపరచడం జరుగుతుం దని, రోడ్డు వెంబడి పిచ్చి చెట్లను తొలగించి డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచడం జరుగు తుందని అన్నారు. డ్రైనేజీల్లో వ్యర్థ పదార్థాలు వెయ్యకుండా చెత్త బండితోనే వేయాలని ఆమె సూచించారు.

## మధిరను క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా మార్చటమే లక్ష్యం

- ఇల్లందులపాడు పారిశుద్ధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించిన చైర్‌పర్సన్



**ప్రజాపక్షం/ మధిర :** మధిరను క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా మార్చటమే లక్ష్యమని మధిర మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లందులపాడులో మున్సి పల్ కమీషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సంద ర్భంగా సైడ్‌డ్రైన్ల వ్యవస్థను పరిశీలించారు. ఇల్లందులపాడు వ్యాప్తంగా ఉన్న కాల్వలను శానిటే షన్ సిబ్బంది శుభ్రపరిచారు. అదేవిధంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ పరిశుభ్రతే ప్రధానంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా కాల్వలను శుభ్రం చేయించడం ద్వారా దోమల బెడద తప్పుతుందని చెప్పారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు అనునిత్యం నిర్వహిస్తూ మోడల్ మున్సిపాలి టీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు అధికారులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మధిరమున్సిపాలిటీలో ఏ సమస్య తలెత్తిన ప్రజలు తనను నేరుగా సంప్రదించాలని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలనాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు, సామినేని రామ నాథం, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కోట డేవిడ్, తాళ్లూరి రాధాకుమార్, బోడేపూడి గోపి, నంద్రు శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ పథకంపై రైతులకు శిక్షణ



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం మండ లంలోని భీమవరం రైతువేదికలో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మపథకంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసంద ర్భంగా ఎడిఏ విజయచంద్ర మాట్లాడుతూ వివిధ పంటల్లో ఎరువులు ఎప్పుడు వేసుకోవాలి, ఎంత మోతాదులో వేసుకోవాలని, నానో యూరియా, నానో డిఏపి వల్ల ఉపయోగాలను వివరించారు. మధిర ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణిదేవి మాట్లాడుతూ వరిలో ప్రస్తుతం ఉన్న వంగడాలు, అపరాల్లో ఉన్న వంగడాలపై వివరించారు. కీటక శాస్త్రవేత్త నాగస్వాతి మాట్లాడుతూ పంటల్లో వచ్చే చీడపీడలు, వాటిని ఎలా తట్టుకోవాలి, సాయిల్ హెల్త్ కార్డు ఉపయోగం తదితర విషయాలపై రైతులకు వివరించారు. మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు మాట్లాడుతూ ఈప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండదండలుగా ఉంటుందని, ప్రస్తుతం ఉన్న పథకాలు రాయితీలపై ప్రతిఒక్క రైతు తెలుసుకుని శాస్త్రవేత్తలు చెప్పే మెలకువలు పాటించి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. అలాగే డ్రోన్లు ఎలా ఉపయో గించాలని డెమో వేసి చూపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి సాయిశివ, ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ నాగేశ్వరరావు, కిసాన్ సెల్ అధ్యక్షులు నాగిరెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు, ఎఇఓలు, రైతులు పాల్గొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాల శిబిరం



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని రావినూతల గ్రామంలో శుక్రవారం నిర్వహించి న ఉచిత పశువులకు గాలికుంటు వ్యాధి నివార ణ టీకాలు కార్యక్రమం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని గ్రామసర్పంచ్ బద్రునాయక్, ఉపస ర్పంచ్ దొండపాటి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల శిబిరాన్ని ఆవులు, గేదెలు ఉన్న ప్రతిఒక్క రైతులు సద్విని యోగం చేసుకోవాలని తెలిపారు. శిబిరంలో పశులకు టీకాలకు వేయటంతో పాటు అవసరమైన వాటికి వైద్య చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వై.అన్వేష్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ వెంకటనారాయణ, నాగే ఒదర్, రవికృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ శ్రీకాంత్, చెన్నయ్య, గోపాలమిత్ర నాగులమీరా, అశోక్, పశుమిత్ర త్రివేణి పాల్గొన్నారు.

## వికలాంగుడికి వీల్‌చైర్ అందజేత



**ప్రజాపక్షం/బోనకల్ :** మండల పరిధిలోని చిరు నోముల గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్ గత కొంతకాలంలో అంగవైకల్యంతో బాధపడుతు న్నాడు. గతంలో సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి వారిసమస్యలను తెలుసుకుని వారికి అండగా ఉంటానని గ్రామస ర్పంచ్ అనుమోలు చంద్రకళ హామీ ఇచ్చారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు అంగవైకల్యంతో బాధపడుతున్న దుర్గాప్రసాద్‌కు వీల్‌చైర్‌ను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరునోముల గ్రామ ప్రజలు తనమై ఉన్న నమ్మకంతో సర్పంచ్‌గా గెలిపించారని, వారి నమ్మ కాన్ని వమ్ము చేయకుండా ప్రజల శ్రేయస్సు కోసం, గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిమ్మతోట రఘు, వార్డు సభ్యురాలు పట్టా సుజాత, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు గూడా నర్సయ్యశాస్త్రి, కాంగ్రెస్ యువజన నాయకులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో శుక్రవారం ఆ వార్డు కౌన్సిలర్ వుండ్రు వరలక్ష్మి శ్యామ్‌బాబు డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వార్డులో డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాన్ని శుభ్రం చేయడం, రోడ్డు ప్రక్కన వ్యర్థపదార్థాలు తొలగించడంతో పాటు గృహాల నందు నీటి నిల్వలను ఉంచకుండా చూసే విధంగా పలు సూచనలు చేశారు. అనంతరం కౌన్సిలర్ వుండ్రు వర లక్ష్మి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంతోనే ఆరోగ్యంగా ఉంటామని మన చుట్టూ పరిసర ప్రాంతాలను ఎక్కడ కూడా పరిశుద్ధ సమస్య లేకుండా నీరు నిల్వ లేకుండా చూసుకోవడం మనందరి బాధ్యత, నీరు నిల్వ ఉండటం వలన దోమలు వృద్ధి చెంది రకరకాల వ్యాధులు వస్తాయని వాటిని దృష్టిలో పెట్టుకొని మనం ఆరోగ్యంగా ఉండే దుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు, అంగన్‌వాడీ సిబ్బంది , ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులతో చైర్‌పర్సన్ సమీక్ష



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలి టీలో విద్యుత్ అధికారులతో మున్సి పల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని విద్యు త్ సమస్యలపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ గురులింగం, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి నాడే భద్రగిరి మార్ట్ ప్రారంభం



**- నాణ్యతకు అధిక ప్రాధాన్యత**
**- ఐటిడిఏ పిఒ రాహుల్**

ప్రజాపక్షం/భద్రాచలం : సహజ సిద్ధమైన పోషక విలువలు గల ఆహార పదార్థాలను ప్రజలకు అత్యంత చేరువగా చేసేందుకు శ్రీరామ నవమి నాడు గిరిమార్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో త్వరలో ప్రారంభం కాబోయే మార్ట్‌కు వివిధ నిత్యావసర వస్తువుల సేకరణను నియమించబడ్డ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ అధికారుల వారీగా ఎస్‌హెచ్‌జి గ్రూపు మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల సహజ సిద్ధమైన సరుకులు, గిరిజన రైతులు నుండి సేకరించ వలసిన బియ్యం, పప్పు, సిరి ధాన్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు కొన్ని సూచనలు చేశారు. సేకరించే ప్రతి వాస్తువు నాణ్యతతో ఉండాలని, ప్రధానంగా తేనె, మిల్లెట్ బిస్కెట్లు, పప్పు ధాన్యాలు, వివిధ రకాల బియ్యం ఇతర గృహోపకరణాలకు ఉపయోగపడే ప్రతి సరుకు ఆర్గానిక్‌కు సంబంధించి ఉండాలన్నారు. 88 మహిళా సంఘాల వారు గిరి ఉత్పత్తులు అటవీ ఫలాలు ప్రాచుర్యంలోనికి తీసుకురావడమే కాకుండా మార్ట్‌కు వచ్చే వినియోగ దారులు సంతృప్తి చెందే విధంగా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఆవు, గేదె నెయ్యితో పాటు నాటు కోడి గుడ్లు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, ఇతర అధికారులు ఉదయ్, రాంబాబు, వేణు, రమేష్, గన్య, హరికృష్ణ, ప్రభాకర్, ఆదినారాయణ పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి ఐటిసి సహకారం అభినందనీయం





**-ఐటీసీ సిఎస్ఆర్ నిధులతో రూ 50లక్షల డ్రైన్లకు శంకుస్థాపన**
**-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు**




ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల అభివృద్ధికి ఐటీసీ సహకారం అభినందనీయమని పినపాక నియోజకవర్గ ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డి పాలెం గ్రామంలో ఐటీసీ పీఎస్పీడీ సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ 50లక్షల విలువైన సీసీ డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈకార్యక్రమానికి పినపాక నియోజకవర్గ ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై నాలుగు సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎడమకంటి పిచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎంఎల్ఏకు ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయలు కొట్టి జేసీబీతో మట్టి తవ్వి పనులను ప్రారంభించారు. అనంతరం నాగినేనిప్రోలు జండా చెట్టు వద్ద, గొమ్మూరు కాలనీ, గాదె వెంకటేశ్వర్‌రెడ్డి నివాసం సమీపంలో డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బూర్గంపాడు మండలంలో ఐటీసీ సంస్థ ఉండటం మండల ప్రజలకు అదృష్టకరమని అన్నారు. ఐటీసీ సిఎస్ఆర్ నిధుల ద్వారా ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్య రంగాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా సిఎస్ఆర్ నిధులను మరింతగా తీసుకువచ్చి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో పూర్తయిన ఇళ్లకు బిల్లులు పూర్తి స్థాయిలో మంజూరు చేశామని, రెండో విడత ఏప్రిల్ 16న ప్రారంభమవుతుందని వెల్లడించారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకొని పథకాల లబ్ధి పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమార్, ఎంపీడీఓ జమలారెడ్డి, పంచాయితీ కార్యదర్శి స్పందన, ఐటిసి ఉన్నతాధికారి చెంగల్‌రావు, బూర్గంపాడు ఉప సర్పంచ్ గుండె వెంకన్న, పార్టీ నాయకులు భజన ప్రసాద్ కుమార్, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, కాటం వెంకట్రామిరెడ్డి, ఇంగువ రమేష్, దుగ్గెంపూడి శేఖరెడ్డి, ఆవుల నాగిరెడ్డి, గాదె వెంకటేశ్వరరెడ్డి, ఎడమకంటి రోశిరెడ్డి, పాలెం లక్ష్మీ రెడ్డి, చంచలపు శ్రీనివాసరావు, ఎడమకంటి సుధాకర్‌రెడ్డి, కైపు శ్రీనివాసరెడ్డి, సారెడ్డి అశోక్‌రెడ్డి, సుశాంత్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మల హరీష్ యాదవ్, సంతోష్, భాస్కరరావు, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దునుకు రాము, కందుల రాము యాదవ్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింప్లీ సాయి, రాగా నరేష్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య



**-ప్రియుడితో కలిసి అర్ధరాత్రి ఘాతుకం**

ప్రజాపక్షం/చంద్రుగొండ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామంలో భార్య తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను అర్ధరాత్రి సమయంలో ఊపిరాడకుండా చేసి చంపినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం తిప్పనపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జాఫర్(33)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చింతలపూడి ప్రాంతానికి చెందిన ఖతీజాతో సుమారు 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. కొంతకాలం పాటు వీరి కుటుంబ జీవితం సాఫీగా సాగింది. ఈ క్రమంలో చింతలపూడి ప్రాంతానికి చెందిన ఓ యువకుడితో ఖతీజాకు పరిచయం ఏర్పడి అది అక్రమ సంబంధంగా మారినట్లు సమాచారం. భర్త జాఫర్ మద్యానికి బానిస కావడంతో అదే అవకాశంగా తీసుకొని ఆమె ప్రియుడితో సంబంధాన్ని కొనసాగించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గురువారం(మార్చి 12)అర్ధరాత్రి సుమారు 1గంట సమయంలో నిద్రలో ఉన్న జాఫర్‌ను ఖతీజా తన ప్రియుడితో కలిసి ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. అనంతరం ప్రియుడు అక్కడి నుండి రాత్రికిరాత్రే పరారైనట్లు సమాచారం. ఉదయం సమయంలో మంచం మీద నుండి పడిపోవడంతో భర్త చనిపోయాడని ఖతీజా ఏడుస్తూ గ్రామస్తులకు, కుటుంబ సభ్యులకు చెప్పడంతో మొదట అందరూ నమ్మారు. దీంతో గురువారం సాయంత్రం ముస్లిం సంప్రదాయాల ప్రకారం జాఫర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే శుక్రవారం ఖతీజా తన ప్రియుడితో ఫోన్‌లో మాట్లాడటం, భర్త మరణాన్ని తేలిగ్గా తీసుకోవడం వంటి విషయాలు గమనించిన కుటుంబ సభ్యులకు అనుమానం కలిగింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఖతీజాను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. ఖననం చేసిన మృతదేహాన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వలస గుత్తి కోయలకు అండగా పోలీస్ శాఖ



ప్రజాపక్షం/కరకగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వలస గుత్తి కోయ గ్రామాలకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుమూల వలస గుత్తి కోయ గ్రామాలైన నీలాద్రిపేట గండి, అశ్వాపురం పాడు గ్రామాలలో ప్రజలకు శుక్రవారం నీలాద్రిపేట గండి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరంతో పాటు సోలార్ వీధి దీపాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఉచిత మెగా వైద్య శిబిరానికి సుమారుగా 70 కుటుంబాల నుండి 300 మంది ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వలస ఆదివాసి ప్రజల సంక్షేమం,అభివృద్ధి కొరకు నిత్యం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలను వారికి కల్పించేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ వారికి కూడా మెరుగైన జీవితాన్ని అందించడానికి ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులం దరూ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలన్నింటిని కూడా వారికి అందే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు తమ గ్రామాల్లోకి ప్రవేశిస్తే వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు చీరలు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. యువతకు టీషర్ట్స్ తో పాటు వాలీబాల్ కిట్లను అందజేశారు. స్కూల్ పిల్లలకు స్కూల్ బ్యాగులు, నోటు బుక్స్ తో పాటు సోలార్ స్టడీ ల్యాంప్స్ ను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రామస్తులందరికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గ్రామాలలో ప్రజలకు సేవాలందించిన వైద్య బృందానికి ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తమ గ్రామంలో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేసినందులకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసి, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు సురేష్, పి.వి.ఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# సివిల్ సప్లై అధికారుల మెరుపు దాడులు

**34 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం**



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండల కేంద్రంలోని హోటళ్లు, కిరాణా దుకాణాలపై సివిల్ సప్లై అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా కలెక్టర్, సివిల్ సప్లై జిల్లా అధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో మొత్తం 34 అక్రమ గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కిరాణా షాపులు, హోటళ్లలో అక్రమంగా దాచిన సిలిండర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సామాన్యుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎక్కువ రేట్లకు అమ్ముతున్న వారిపై చర్యలు చేపడతామని హెచ్చరించారు. గ్యాస్ కొరత లేదని, అవసరానికి మించి నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీఎస్ఓ వరదరాజులు హెచ్చరించారు. ప్రజలకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఎవరూ ఆందోళన చెంది అధిక ధరలకు కొనవద్దు. అక్రమంగా నిల్వ చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై ఆర్ఐ వెంకటేశ్వర్లు, భద్రాచలం డిప్యూటీ తాసీల్దార్ రాజులు, ఇల్లెందు యుడిఆర్ఐ రాంబాబు, జూలూరుపాడు పోలీసులు పాల్గొన్నారు.

# సీడ్ బ్యాంక్ స్థాపన శిక్షణ కార్యక్రమం



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలంలోని తాటిగూడెం, అనంతారం గ్రామాలలో శుక్రవారం సీడ్ బ్యాంక్ స్థాపన శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. తాటిగూడెం గ్రామ సర్పంచ్ కే. విజయలక్ష్మి, గ్రామ కార్యదర్శి వీరన్న పాల్గొని దేశీ విత్తనాల సీడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ భాస్కర్ దేశీ విత్తనాల గొప్పతనం, వాటి ప్రాముఖ్యత గురించి పాల్గొన్న వారికి వివరించారు. "మన ఊరు మన విత్తనం" అనే నినాదంతో, ప్రకృతికి అనుగుణంగా సాగు చేస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడేలా సంస్థలు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సీడ్ బ్యాంక్ ఎస్‌హెచ్‌జి మహిళలు, క్లస్టర్ కోఆర్డినేటర్ స్వాతి, సీఆర్పీలు నరేష్, రస్మా, హైమావతి, కరకగూడెం మండలం ఆదివాసి జేవీసీ చైర్మన్ వెంకటనారాయణ పాల్గొన్నారు. కోనేరు డైరెక్టర్ ఎం.ఏ. సలీం, మండల కోఆర్డినేటర్ పి. వెంకటేష్ తమ సలహాలు, సహకారాలు అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన




ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ)ఆధ్వర్యంలో రెండో రోజు రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త పావని, ఖమ్మం రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి భాస్కరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిషేధిత పత్తి సాగు వల్ల కలిగే కష్టాలను రైతులకు వివరించారు. అలాగే వ్యవసాయంలో నానో ఎరువుల ప్రాముఖ్యత, డ్రోన్ సాంకేతిక వినియోగం, భూసార పరీక్షల అవసరం, పామాయిల్ సాగు, ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, మండల ఏఈవోలు, ఆత్మ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేస్తూ సంక్షేమ ఫలాలు అందిస్తాం

-అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
-ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో మంత్రి పొంగులేటి







**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాల మూడు నెలలు గడిచిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణాలలో రోడ్లు, డ్రైయిన్లు ఇతర ఇతర మౌళిక వసతుల కల్పన పనులు ప్రాధాన్యతతో చేపట్టామని, క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం 99 రోజుల కార్యక్రమం చేపట్టిందని అన్నారు. దమ్మాయిగూడెం గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్య శనివారం వరకు పరిష్కారం అవుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నూతన రేషన్ కార్డులు జారీ, 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా వంటి అనేక హామీలను అమలు చేశామని అన్నారు. ఏప్రిల్ నెలలో మరో విడత ఇందిరమ్మ ఇండ్లు ప్రజలకు మంజూరు చేస్తామని, రాబోయే మూడు సంవత్సరాలలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుందని మంత్రి తెలిపారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దమ్మాయిగూడెం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల పాటు చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు శిక్షణ అందించామని, మొదట గ్రామంలో పారిశుద్ధం పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్ పై దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీకి విడుదలైన నిధులు వినియోగిస్తూ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. గ్రామ పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా రోడ్లను క్లిన్ చేయడమే కాకుండా అంగన్వాడీ కేంద్రాలు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను కూడా శుభ్రం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలారు సాహెబు, సర్పంచ్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి

మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



**ప్రజాపక్షం/వైరా:** డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలి. మన పరిసరాలను శుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డుతో పాటు మరికొన్ని వార్డుల్లో డాక్టర్ కాపా చంద్రకళ పర్యటించారు. ఈ సందర్భంగా నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని నీరు నిల్వ లేకుండా పూర్తిగా బయటికి తరలించాలని అన్నారు. నీరు నిల్వ ఉండడం వలన దోమలు వృద్ధి చెంది రకరకాల వ్యాధులకు కారణం అవుతాయని వైరల్ ఫీవర్స్ వస్తాయని ఆమె అన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లో ఎక్కడ ఎలాంటి డబ్బాల్లో కాని హౌస్‌లో గాని నీరు నిల్వ లేకుండా నిరుపయోగంగా ఉన్న నీరు నిల్వను వెంటనే తొలగించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో మనందరం భాగస్వాములు కావాలని ఆమె తెలిపారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా కెఎస్‌పి ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/వైరా:** తొలి తెలుగు మహిళా కవయిత్రి కుమ్మర మొల్లమాంబ జయంతి వేడుకలు శుక్రవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు కెఎస్‌పి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శికట్ల రంగారావు, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ చైర్మన్ గంగారావు, జిల్లా కాంగ్రేస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ పాల్గొన్నారు. మొల్లమాంబ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ తొలగి తెలుగు మహిళా కవయిత్రి కుమ్మర మొల్లమాంబ జీవిత చరిత్రను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కెఎస్‌పి రాజకీయ భాగం ఇంచార్జి గుమ్మడిదల వెంకటనారాయణ, కాంగ్రేస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, విలాసాగరం వెంకటేశ్వర్లు, ఇనుగంటి ప్రసాద్, ఎల్ఐసి వెంకటేశ్వర్లు, విలాసాగరం నరేష్, దరిపల్లి శ్రీనివాసరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి నవీన్, గాజుల పురపు శ్రీను, ఉపేందర్ బండి రవి, సురేందర్, నారాయణ, విజయ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# శిక్షణ తరగతులను విజయవంతం చేయండి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి.యు.సి.ఐ) రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు సూర్యాపేటలోని కిరణ్ మర్చంట్ ఫంక్షన్ హాల్‌లో నేటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్నాయని, ఈ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తోందని అన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులకు జీవన భద్రత, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితుల కోసం దేశవ్యాప్తంగా కార్మిక వర్గం పోరాటం సాగిస్తోందని తెలిపారు. మార్చి 14న 'మార్క్స్ తత్వ శాస్త్రం పై సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, 'అర్థశాస్త్రం'పై రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే.జి. రామచందర్ బోధించనున్నారు. మార్చి 15న 'రష్యా విప్లవంలో కార్మిక వర్గం పాత్ర'పై టి.యు.సి.ఐ రాష్ట్ర అధ్యక్షుడు కే. సూర్యం, 'భారత కార్మిక ఉద్యమంనాటి చట్టాలు, నేటి లేబర్ కోడ్లు'పై రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రమేష్, కుమార్, పవన్, పురుషోత్తం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# మంచిగా చదివి లక్ష్యం చేరుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



**ప్రజాపక్షం/వైరా:** నేను ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థినినే అని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం వైరాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు వ్రాసే విద్యార్థులు అందరికి డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. అనంతరం డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచిగా పరీక్షలు వ్రాసి ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు చెడు మార్గంలో ప్రయాణించవద్దు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. మీకు విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు, పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు ఉన్నత చదువులు చదివి ఆదర్శంగా నిలవాలని ఆమె సూచించారు. పరీక్షలను భయంతో కాకుండా బాధ్యతతో చదివి ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా వ్రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రేస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు మాధవరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖరరావు, కృష్ణ, నరసింహారావు, అనిత తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతాం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ మురళీకృష్ణ. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భా గంగా 99 రోజులపాటు జరిగే ఈ అభివృద్ధి కార్యక్రమంలో మీరందరూ పూర్తిస్థాయిలో పనుల్లో నిమగ్నమై వైరా మున్సిపాలిటీని క్లీన్ మున్సిపాలిటీగా ఉంచాలని సూచించారు. మనందరం కలిసికట్టుగా ఉండి మున్సిపాలటీని సుందరంగా చేసుకుందాం పారిశుధ్ధ్య సమస్య లేకుండా పరిష్కరించుకుందాం అని అన్నారు.

# ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు పాల్గొని డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వాటిని తొలగించి పారిశుధ్య పనులు పర్యవేక్షించారు. అనంతరం కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వార్డులో పారిశుధ్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగింది. ప్రతిరోజు డ్రైనేజ్‌లు శుభ్రపరచడంతో పాటు రోడ్ల ప్రక్కన చెత్త మొక్కలను తొలగించడం జరుగుతుంది. శుక్రవారం జరిగిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించి దోమలు వృద్ధి చెందకుండా లార్వా స్ప్రే చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# మొండికుంటలో ఫ్రైడే..డ్రైడే కార్యక్రమం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మొండికుంట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే..డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మర్రి సంధ్య గ్రామంలోని ఇళ్లను సందర్శించి నీటి నిల్వ ట్యాంకులను పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం నీటి ట్యాంకులను ఖాళీ చేయాలని ఇంటి యజమానులకు సూచించారు. ఇలా చేయడం వల్ల దోమలు గుడ్లు పెట్టకుండా ఉండి, దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లమల్ల శివకుమార్, పంచాయితీ కార్యదర్శి సంధ్య, ఏఎన్ఎం లలితకుమారి, అంగన్వాడీ టీచర్లు హంసవేణి, సుధ, లత, ఆశ కార్యకర్త కృష్ణవేణి, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# నవచైతన్య సేవలు ప్రశంసనీయం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నవ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవ కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు అన్నా రు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఓల్డ్ యుపిఎస్ పాఠశాల, కొత్త కొమ్మేపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్ల ఎరేజర్లు, షార్ప్ నర్లను నవ చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎం ఈ ఓ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఇటీవల జరిగిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్ పోటీల్లో 7 బహుమతులు సాధించిన పాఠశాల విద్యార్థులను సంస్థ ఆధ్వర్యంలో శాలువాలతో అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి శ్రీనివాసరెడ్డి, నజీర్ పాషా,ఉపాధ్యాయులు నరేష్, రాణికుమారి, సరిత, సంస్థ డైరెక్టర్లు సురేంద్ర సింగ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.